# పంచపాత్ర

## కే ఎ స్వే

(గతసంచిక తరువాయి)

ఆ మెనుగూర్చి ఆమె "నేను" అని కాకుండా "కైక" అనే రిఫర్ చేస్తూ రావడం వింతగా వున్నా నామటుకూ నాకు చక్కగా వున్నట్టే అనిపించింది. నాకేసి చూస్తూ నేవున్నా, తనకు తానే చెప్పుకుంటున్నట్టు చెప్పుకుపోతూనేవుంది కైక.

-స్కూల్ ఫైనల్ పాసౌతూనే "ఇహ నువ్వు పెళ్ళిచేసేసుకు నెయ్య కైకా !-" అన్నాడు తండ్రి.

"నాకా ఇప్పుడ పెళ్ళా ?-" అంది కైక.

కైక తండ్రి ఎన్నిందాలుగా చెప్పినా వినకుండా కాలేజీలో జేరింది కైక. చదివుద్దరిద్దామని కైకకి లేదు. కాని, చదువుదామని వుంది చదువుదామనీ కాదు, కాలేజీకి వెళ్దామని. అంటే-కాలేజీ జీవితంలో మాధుర్యం చవిచూద్దామని.

చదివించేటంత దీనస్థితీ హీనస్థితీకూడా కాదు కైకతండ్రిది. కాని, ఆడపిల్లల్ని చదివించి ఏం భరిస్తాడు చెప్పూ ? మార్కెట్‌లో అల్లుళ్ళ రేట్లు పెట్రోలు ధరలకన్నా ఎక్కువగా పెరిగిపోతున్నాయి!! అందుచేత, కైకకు తెలీకుండానే కైకకని పెళ్ళిసమ్మంధా లొహావంక చూస్తూనే వున్నాడు కైక తండ్రి.

కాలేజీలో జీవిత మాధుర్యం చవిచూడాలని కదూ కాలేజీలో జేరింది కైక ? కాలేజీలో ఆమె ఆ మాధుర్యం కాస్తా చవిచూడనే చూసింది. రంగురంగుల చీరెలు, వారానికి రెండు సినిమాలు, క్లాసులో అబ్బాయిలు, బోరుకొడితే కేంటీన్లు, బోరు కొట్టక పోయినా పార్కులు. ఇంకేం ? జీవితం అంటే సుఖపడడం అనే నిర్ణయానికి కుమారికైక రావడానికి అమాత్రం సదవకాశాలు సరిపో యేయి. నెలనెలా కలచనిగా మనియార్డర్ పంపడానికి ఎవరో వొక రు: డాలిగాని, అట్లాంటి అభిప్రాయం ఈ జీవితంమీద కలగడం ఏమంత కష్టం ?

గొప్ప రూపం లేకపోయినా మంచిరూపం వుందన్నాను కదూ కైకకి ? ఐస్తే జీవితంలో-కాలేజీ వాతావరణంలో - కైక అందం కొత్తమెరుగులు దిద్దుకుంది. రోజారోజుకీ కైకలో వొక కొత్త అందం మొగ్గలెయ్యసాగింది. ఆ అందంవేసే మొగ్గలు పరాయి కళ్ళలో పడనే పడ్డాయి.

కైక కాలేజీ బ్యూటీ అయింది.

కాలేజీ బ్యూటీ కైకకి సహజంగానే చదువుడ్యూటీమీద శ్రద్ధ తగ్గింది.

సినిమాల్లో ప్రత్యేకం హిందీసినిమాలూ, అందులో ప్రత్యేకం హిమాలయా కాశ్మీర్-ప్రాంతాల్లో-డ్యూయెట్లుండే దృశ్యాలూ-ఇవంటే మక్కువ ఎక్కువైంది.

కుమారి కైక70 మిల్లీమీటర్ల ఈస్ట్మన్ కలర్ కలలే గాని, మామూలు 35 మిల్లీమీటర్ల బ్లాక్ అండ్ వైట్ కలలు గనడం ఎప్పుడో మర్చిపోయింది.

పాపం, కైక తండ్రి మాత్రం చాలారోజులు బ్లాక్ అండ్ వైట్ లోనే వుండిపోయేడు.

దూరబ్బంధువులబ్బాయి వొకతను-గోపీ సుందరం అనేవాడు-వుద్యోగం కోసమని తనని ఆశ్రయించే సరికి వాడిమీదికి కెమిరా ఫోకస్ చేసేడు కైక తండ్రి.

గోపీ సుందరానికి తల్లీలేదు, తండ్రీలేదు. పెంచుకుంటూన్న మామయ్య చెప్పాచెయ్యకుండా వొక వుదయం ఆఫీసుకెళ్ళి అట్నుంచటే స్వర్గానికో, నరకానికోగాని-మొత్తానికి పరలోకానికి ప్రయాణం కట్టేడు. వొళ్ళంతా నోరేవున్న అత్తమ్మ-మొగుడుపోయిన ఆరోరోజు కల్లా-గోపీ సుందరాన్ని నానామాటలూ ("దరిద్రపుగొట్టు వెధవా!-నీవల్లే ఆయన ఆ గతి అయ్యేరు-" !!) అని-ఇంట్లోంచి వెళ్ళగొట్టే సింది. తెగిన గాలిపటంలాంటి గోపీసుందరం ఎండీ ఎండని చెట్టులాంటి కైక తండ్రి ఇంటికొచ్చి చిక్కుకున్నాడు.

చిక్కుకోవడమంటే - చిక్కించుకున్నాడు కైకతండ్రి !

కు రాదు పి రగా. బు రగా వున్నాడు. గుణానికి మంచివాడే! చెప్పినట్టల్లా వింటాడు. ఏదో వొహ వుద్యోగం చూసి పెట్టేస్తే ఇంట్లోనే పడుంటాడు. అన్నట్టు—గోపీసుందరం కైకమ్మకి ఈడూ జోడూ కూడాను!

కుర్రాణ్ణి కూతురికిచ్చి పెళ్ళిచెయ్యాలనుకోవడం దురుద్దేశమేం కాదు గద! అందుచేత – సకల సదుద్దేశాలతోనూ గోపీ సుందరాన్ని ఇంట్లో వుంచుకుని ఆదరించి అతడి కోసం వుద్యోగాలు వెదకసాగేడు కైక తండ్రి.

అంతట్లోకి వొకసారి పరీక్షలానంతరం శెలవులో ఇంటి కొచ్చింది కైక. వొచ్చి గోపీసుందరాన్ని చూసింది. అతన్ని ఇంట్లో వుంచుకోవడంలో తండ్రి వుద్దేశం ఆమెకు అర్థమై పోయింది. కైక అమాయకురాలు కాదు. అయినా – అమాయకంగానే వుండిపోదలచ లెదు.

గోపీ సుందరం కూడా పాపం కైక తండ్రి అనుకున్నంత అర్భకుడేం కాడు.

కనీసం కైక అనుకున్నంత అర్భకుడు కూడా కాడతను.

అతను తొలి తొలి ప్రయత్నాల్లో వుండగానే ఆ విషయం కైక కనిపెట్టింది–

"ఏం కనిపెట్టేరు మీరు?" అని అడిగేను.

తమాషాగా చూసింది కైక—"డోంట్ బీ సిల్లీ...మీరూహించ గలరు—"

"గలను కాని—మీరు పూర్తిగా చెప్తే—"

"ఇంతకంటే పూర్తిగా—ఇంకేమీ చెప్పను—"

"సరే-కానివ్వండి—"

"మీరింకో సిగిరెట్టు వెలిగించండి......రింగులు రింగులుగా పొగ వదల్లేరూ మీరు?"

"వూహూఁ—వొదల్లేను—కథ చెప్పండి—మీ కథ—"

"మీరు రింగులు రింగులుగా పొగ వదిల్తే బాగుణ్ణు—ఇహనైనా నేర్చుకోండి—సరే—ఎక్కడున్నాం?—"

"నా రూంలో—"

"అది కాదు-కథెక్కడుంది?-"

"చెప్పినంతవరకూ నా మెదళ్ళో-అదీనూ ప్లస్ ఇక చెప్ప బోయేదీ మీ మెదళ్ళో—"

"అదికాదు బాబూ! కథ చెబుతూ ఏ ఘట్టంలో ఆగేను?"

"అతను తొలి తొలి ప్రయత్నాల్లో వుండగానే ఆ విషయం కైక కనిపెట్టింది—"

పోగొట్టుకున్న కాణీ దొరికిన స్కూలు పిల్లలా ఆనందంగా నవ్వింది కైక.

—ఆఁ—అతను తొలితొలి ప్రయత్నాల్లో వుండగానే ఆవిషయం కైక కనిపెట్టేంది. ఇహ అడ్డు ప్రశ్నలేవీవెయ్యకుండా వినండి, ఏం?–ఆ కనిపెట్టిన కైక ఏం చేసింది? గోపీ సుందరాన్ని ఎంత దూరంలో వుంచాలో అంత దూరంలో వుంచింది. ఆమెకు మా తం లోపల్లోపల గోపీసుందరమంటే అదోలాంటి అభిమానం లేకపోలెదు. కాని, దాన్ని ఆమె బైట పెట లేదు. బైట పెడితే తను చులకనై పోతుంది. ఏదైనా సహిస్తుంది గాని, వొక అబ్బాయికి తను చులకనై పోవడం మాత్రం సహింపజాలదు కైక.

శెలవులైపోయి మళ్ళీ కాలేజీకి వెళ్ళాల్సి వొచ్చేసరికి కైకకు మనసు దిగులుగా అయిపోయింది. కారణం తెలియని (!) గుబులు ఎవ్వరితోటీ చెప్పుకునేదీ కాదు! !

"నే(నేపు టౌను కెళ్తున్నా—" అంది కైక గోపీ సుందరంతో

గోపీ సుందరం ఏమీ మాట్లాడలేదు:

అప్పుడు కైక తండ్రి ఇంట్లో లేదు.

"—మళ్ళీ ఇంకో నాలుగు నెళ్ళకి—" అంది కైక. గోపీ సుందరం ఏమీ మాట్లాడకుండా వుండేసరికి ఆమెకి కొంచెం విసుగు కూడా వొచ్చింది. "అదోలా వున్నావు సరే-నే వెళ్తాలే-" అని కదిలింది కైక.

"కైకా!—" అన్నాడు గోపీసుందరం. కళ్ళలో కోరికతో ఆమె దగ్గిరి కొచ్చేడు "నువ్వివాళ ఎంత అందంగా వున్నావు!–" అన్నాడు... ...

"ప్చ్!-" అని చప్పరించేస్నేను. ఏఁవిటో వెధవది. చప్పరించడం అలవాటై పోయింది.

"అదేఁవిటి?" అంది కైక.

"కైక తనెజా గత్తులో తనుందీ గోపీసుందరాన్నితగుమా తం దూరంలోనే వుంచిందీ—అని ఇందాట్నా అన్నారు ..మళ్ళీ ఇదేమిటి?... ఈ రొమాన్స్ సీను..."

"ఏం మీ పాఠకులకి రొమాన్స్సీను సరిపడవా?..."

"పాఠకులక సరిపడవచ్చునేమో......నేను...రాయలేను"

"అయితే-కట్ చేసి మిగతా చెప్పమంటారా ?–"

"వొద్దు. వర్ణన తీసేసి వాస్తవం మాత్రం చెప్పేసెయ్యండి"

"వాస్తవాలు రాస్తే చిక్కుల్లో పడతారు–" అని మళ్ళీ చెప్ప నారంభించింది కైక–

–రచయితగా మీరూ కంగారు పడక్కర్లేదు – మీ పాఠకులూ కంగారు పడక్కర్లేదు. ఆరోజు కైక సుందరాన్ని వుంచాల్సినంత దూరంలోనే వుంచింది. అయితే రెండో మూడో ముద్దులు పెట్టు కోనిచ్చింది. కౌగిలించుకోనిచ్చింది. కాని, అంతే!... ...

"ఆడవాళ్ళు చెడిపోతున్నారు–" అన్నాను.

"ప్లీజ్...అడ్డురాకండి–" అంది కైక సీరియస్‌గా. మళ్ళీ కథనం కొనసాగించింది.

–మరునటిదినం కైక టౌన్ కెళ్ళిపోయింది. క్లాసులు చండ ప్రచండంగా జరుగుతున్నాయి. పరీక్షలు తోసుకొస్తున్నాయి.

కైకకిమాత్రం మనసు మనసులోలేదు. మనసు స్వంత వూళ్లో, స్వంత ఇంట్లో, గోపీ సుందరం దగ్గర మరిచిపోయి వొచ్చేసింది.

కాలేజీలో స్టూడెంటు కుర్రాళ్ళని చూసేకొద్దీ కైక మనసు గోపీ సుందరానికేసే లాగసాగింది. చదువులేదు అతనికి. డబ్బు లేదు. అవకాశాల్లేవు. మంచి బట్టల్లేవు. ఇవన్నీ సుందరానికే గనకవుంటే మన్మథ మన్మథుళ్ళాగే తళతళలాడిపోను. ఏమిటో విధి కృతం. చవట సన్నాసుల్లూ, జిడ్డు ముఖాల మొద్దులూ కాలేజీల్లో చదివి పారేస్తు న్నారు. అంత చక్కటి గోపీసుందరం కాలేజీ మెట్లు కూడా ఎక్కక పోవడం ఎంత అన్యాయం!

కైక ఇలా అనుకుంటూ వుండగానే స్వంత వూర్నుంచి వుత్తరం వొచ్చింది. కైక తండ్రి కైకకి రాసిన వుత్తరం కాదది. గోపీసుందరం కైకకి రాసిన వుత్తరం! కొట్టుకునే గుండెల్తో వుత్తరం తెరిచి చదువుకుని గొప్పసంచలనానికి గురయింది కైక.

నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నువ్వు కాదంటే బ్రతకలేను. వెంటనే నువ్వు వుత్తరం రాయి. లేకపోతే చచ్చిపోతాను.

–అదీ వుత్తరం సారాంశం.

వుత్తరం రాయకపోతే చచ్చిపోయేంత ప్రేమోన్మాదంలో గోపీ సుందరం వుంటే–అతణ్ణి ఎంతో కొంత (అతన్లో ఏం చూసైనా కావొచ్చు) అభిమానించిన కైక–వుత్తరం రాయకుండా ఎలావుంటుంది?

రెండ్రోజులకో వుత్తరమే రాసేదో, రోజుకోటి రాసేదో, పూటకోటి రాసేదో–మొత్తానికి తండ్రి పంపే డబ్బులో చెప్పుకో దగినంత – పోస్టేజీకింద ఖర్చు పెట్టింది కైక.

గోపీసుందరం కవి అనుకోవడానికి వీలేమీలేదు. కాని, ఆడ పిల్లకి వుత్తరాలు రాసేప్పుడు అంతో ఇంతో ఆ పైత్యం కూడా కలబోసి పంపని వాడెవ్వడు ?

కైక సహజంగానే వూహల మనిషి. వూహలు కాగితం మీదికి దొర్లడానికి ప్రేమలేఖల్ని మించిన అవకాశం ఎక్కడిది?

శరపరంపరగా కైకకీ గోపీసుందరానికీ మధ్య వుత్తరాలు నడిచేయి. నడవడమేమిటి? ఎగిరేయి!

అయితే ఈ వుత్తరాయణం గురించి కైక తండ్రికి తెలుసా?

తెలుసనడానికి ఆధారాల్లేవు. తెలీదనుకోవడానికి అవకాశాల్లేవు. తెలివైనవాడు, లేదా-తను తెలివైన వాడేనని అనుకునేవాడు – కైక తండ్రి. చూసీ చూడనట్టు వుండడం మంచిదనే నిర్ణయానికి వొచ్చేడు.

ఎలాగైనా–తన పరీక్షలైన తర్వాత గోపీసుందరాన్ని పెళ్ళాడే సెయ్యొచ్చు ననుకుంది కైక.

కైక తండ్రీ అలాగే అనుకున్నాడు.

కాని, గోపీసుందరం అలా అనుకున్నట్టు కనిపించలేదు.

కైక తండ్రి ప్రయత్నాల వల్ల వొక వుద్యోగం దొరకగానే అతను తనదారి తాను చూసుకున్నాడు. కైకను పెళ్ళిచేసుకుంటే – కట్నంరూపేణా తనకి చిల్లిగవ్వ దక్కదని అతనికి తెలుసు, కైక అందమైనదే! కాని, అందం కొరుక్కు తింటామా ? డబ్బుతో కూడా రాని పక్షంలో–అందమైనభార్యయినా సరే అతనికి అక్కర్లేదు. ఇరవైవేల కట్నంతో వొక సమ్మంధమొచ్చేసరికి మరో ఆలోచన లేకుండా వొప్పేసుకున్నాడు గోపీసుందరం.

రాత్రింబవళ్ళూ హోరాహోరీగా చదివి తోచిందల్లా పరీక్షల్లో రాసేసి (!) బోనునుంచి బైటపడే పక్షిలా ఇంటికొచ్చి వాలింది కైక. తీరా చూసేసరికి ఇల్లంతా చీకటిగావుంది.

"వచ్చేవా కైకా ?–" అని నీరసంగా అన్నాడు కైక తండ్రి. సాయంత్రమై చాలాసేపు దాటినా గదిలో దీపమైనా వెయ్యకుండా కూచున్నాడాయన.

"ఏఁవిటినాన్నా–ఏఁమైంది?–" అంది కైక–అయోమయంగా అంటూ లైటు వేసింది. తలపట్టుక్కూచున్న తండ్రి కనిపించేడు.

మేజామీద పెళ్ళి పత్రికొకటి కనిపించింది.

వరుడిపేరు గోపీసుందరం. వధువు పేరు కనకలక్ష్మీకాంతం,

కైకకి లోకం చీకటై పోలేదు గాని మసకబారింది. ఆమెకు ఏడుపు రాలేదు. కోపమొచ్చింది, కాని, ఆకోపంతో ఆమెగాని; ఆమె తండ్రిగాని—గోపీసుందరాన్ని ఏం చెయ్యగలరు ?

పెళ్ళిపత్రిక పంపాడేగాని మళ్ళీ కైకకేసిగాని కైక తండ్రికేసిగాని తిరిగి చూడలేదు గోపీసుందరం. కొత్త వుద్యోగం - కొత్త సంసారం - కనకలక్ష్మీకాంతంయొక్క భర్త హోదాలో ఇల్లరికపుటల్లుడుగా అతను అత్తగారి వూళ్ళోనే వుండిపోయేడు.

ఒకరాత్రంతా నిద్రలేకుండా పక్కమీదే పొర్లుతూవుండి ప్రొద్దున్నే స్నానాల గదిలో బాయిలర్లో గోపీసుందరం తనకి రాసిన అందమైన వుత్తరాలన్నిటినీ దఖలుపరిచి బరువు తీరినట్టు నిట్టూర్చింది కైక.

"పోనీలే కైకా—దిగులుపడకు—తొందర్లో ఏదోఒక సమ్మంధం చూసి - చేసేస్తాను—" అన్నాడు కైక తండ్రి.

"మనసు బాగులేదు నాకు. ఇప్పట్లో పెళ్ళొద్దు —" అని దృఢంగా జవాబు చెప్పింది కైక.

మరో నెల రోజులకి కైక పరీక్షల రిజల్ట్సు వొచ్చేయి. కైక పేసయింది.

అటుచేసి ఇటుచేసి తండ్రిని వొప్పించి — యూనివర్శిటీ కాలేజీలో ఎం. ఏ. లో చేరింది కైక.

"కథ దాదాపు ముగిసినట్టుంది—" అన్నాను.

"కథలా కనిపించే జీవితం యిది—" అంది కైక. "ఏం — విసుగ్గా వుందా ? మీకు బోర్ కొడితే చెప్పండి—వెళ్ళిపోతాను—"

"కథలో కొత్తదనంలేదు—" అన్నాను.

"జీవితం అలావుంది —" అని, నన్ను లక్ష్యపెట్టకుండా — కైక కథ చెప్పడం సాగించింది కైక.

—గోపీ సుందరాన్ని మరిచిపోవడం కైకకి కష్టమేమీకాలేదు. కాలేజీనుంచి యూనివర్శిటీకి వొచ్చింది కదూ...వాతావరణం మారింది —పరిచయాలేర్పడ్డాయి—స్నేహాలు పెరిగేయి, గోపీసుందరం జ్ఞాపకం మెల్లిమెల్లిగా ఫేడౌట్ అయిపోసాగింది.

అంతలో వొక గమ్మత్తు జరిగింది.

కైక చెల్లెలు—స్కూలు ఫైనలు మూడుసార్లు తప్పి ఇంట్లో కూచున్న తెలివిమంతురాలు—వాళ్ళ ఎదురింటబ్బాయిని గుట్టు చప్పుడు కాకుండా ప్రేమించేసింది. పెళ్ళంటూ చేసుకుంటే కైక చెల్లెల్నే చేసుకుంటానని ఆ అబ్బాయి ప్రతిజ్ఞచేసి పారేసేడు. అతను వాళ్ళ తల్లిదండ్రులకి వొక్కడే సుపుత్రుడు, వంశోద్ధారకుడు. మరతని మాట ఏం చెప్పీ కాదన జాలక వాళ్ళు వాళ్ళొచ్చి కైక తండ్రితో మాట్లాడి—పెళ్ళికి వొప్పించేరు.

కట్నం కాణీ అయినా లేకుండా ఆ రకంగా కైకచెల్లెలి పెళ్ళి సలక్షణంగా వాళ్ళ ఎదురింటబ్బాయితో జరిగిపోయింది.

తను వొంటిగా వుండగానే తన చెల్లెలు తన కళ్ళముందే వొక యింటిది (ఎదురిల్లే అయితేనేం ?) అయిపోవడం చూసి కైకకి పూర్తిగా మతిపోలేదు గాని దాదాపు అంతపనే అయింది.

జీవితంలో తొలిసారిగా ఆమెకు తన అంద చందాలమీద నమ్మకం సడలిపోజొచ్చింది.

"కైక కూడాఎవరో వొకర్ని ప్రేమించి—ప్రేమింపజేసుకుని — పెళ్ళిచేసుకుంటే బాగుణ్ను—" అనుకున్నాడు కైక తండ్రి.

ఆ సంగతి కైక గ్రహించకపోలేదు.


**ఆంధ్ర సచిత్ర వార పత్రిక**

**— చందా వివరాలు —**

విడి ప్రతి వెల ... 0-75 పైసలు

| | మ్యాన్ ఏజంటుద్వారా | పోష్టుద్వారా |
|---|---|---|
| | రు. పై. | రు. పై. |
| సంవత్సర చందా | 39-00 | 41-60 |
| అర్ధ సంవత్సరం | 19-50 | 20-80 |
| మూడు మాసములకు | 9-75 | 10-40 |

మేనేజరు
ఆంధ్రపత్రిక

గ్రహింపులవల్ల పనులు జరగొచ్చుగాని, గ్రహించడమే పని జరగడం కాదుగద !

యూనివర్శిటీకి తిరిగొచ్చేసింది కైక.

కైక తండ్రి వొకవేపు చవక సమ్మంధాలు వొస్తాయేమోనని చూస్తూనే వున్నాడు.

చదువుమీద బుద్ధి నిలవలేదు కైకకి. మెదడు శూన్యమై పోయింది. మనసులో నిశ్శబ్దంగా ఏదో తుపాను. ఏదో కలవరం.

ఎం. ఏ. తొలి సంవత్సరం పరీక్షలు రాసేసొచ్చింది కైక. ఆరేడుగురు అబ్బాయిలన్నా వొచ్చి కైకతో పెళ్ళిచూపుల తతంగాలు జరిపి వెళ్ళేరు. పాపం, కష్టపడే జరిపించేడు కైకతండ్రి. కాని ఏం లాభం ? వొకటీ అతికేట్టు కనిపించలేదు.

“అమ్మాయి మరీ ఫేషన్‌గావుంది-” అని మూతి ముడిచింది వొక అబ్బాయి తల్లి, “అవును-మరీ-ఇంత ఫేషనా ?-”అని పలికేడు ఆ అమ్మకూచి.

“యాభై వేలు-” అని ధర చెప్పేడు వొక అబ్బాయి తండ్రి.

వొక సమ్మంధం దాదాపు కుదిరినట్టే అనిపించి లాంఛనాల ప్రస్తావన దగ్గిర అనవసరంగా మాటామాటా పెరిగి అదీ చెడింది.

“అమ్మాయి నాకు నచ్చింది, నేను చేసుకుంటాను-” అని చెప్పిన వొకబ్బాయి -కట్నం గురించి మాట్లాడుతు - “వూహుం- నేను కట్నం తీసుకోకూడదనుకున్నాను, తీసుకోను కానయితే నేను ఆఫీస్‌కీ ఇంటికీ తిరగడానికి నాకో కారు కావాలి. కొత్త అంబాసిడర్ వొకటి కొనిపెట్టండి చాలు - మీ అమ్మాయిని చేసుకుంటాను-” అన్నాడు.

కారు సమ్మంధానికి తూగలేకపోయేడు కైక తండ్రి.

కైకకీ పెళ్ళిచూపుల తంతుతో విసుగెత్తి పోయింది. వొకటీ కుదరక పోవడం మాట అటుంచి-వొచ్చేవాళ్ళలో కనీసం వొక్క ముఖమైనా కాస్త తేటగా లేకపోవడం ఆమెకు చాలా అనీజీగా అనిపించింది. “ఛీ! మొద్దు మొహాలు - వీళ్ళెవర్తోటీ కుదరకపోవడమే మంచిదయింది - వీళ్ళతో సంసారమా-బాబోయ్ ” అని పెళ్ళిచూపుల కొచ్చిన అనాకారి అబ్బాయిల్ని తిట్టుకుని, ఎవర్తోనూ పెళ్ళికుదిరి పోనందుకు సంతోషించి, తనని తాను వూరడించుకుంది. “సమ్మంధాలని చెప్పి నన్ను మాటి మాటికీ ఇంటికి పిల్చి ఈ పెళ్ళిచూపుల ఫార్సు జరిపించకు నాన్నా-అంతగా కుదురుతుందని తోస్తే - మవ్వే ఏదో వొకటి నిశ్చయం చేసెయ్యి-” అని చెప్పి మళ్ళీ యూనివర్శిటీకి వచ్చేసింది.

ఎం. ఏ. రెండోసంవత్సరం పట్టుబట్టి శ్రద్ధగానే కొన్ని దినాలు చదివింది కైక. కాని ఆ శ్రద్ధ కొన్ని దినాలకంటె ఎక్కువ ఆమెలో నిలువలేదు.

కైక వాళ్ళ క్లాసులోనే యస్. గోపాలం అని వొక కుర్రాడుండేవాడు. అతన్నందరూ సుందరగోపాలమని పిలిచేవారు. యస్. గోపాలం సుందరుడే. మెత్తగా వుండేవాడు, ఎర్రగానూ వుండేవాడు. అతనిలో నాజూకు అధికం. ఆడతనపు నాజూకు. ఆడపిల్లల్ని ఆకర్షించే నాజూకు.

కైకకి చదువుమీద దృష్టి చెడడానికి కారణం యస్.గోపాలం. ఆ సంగతి మొదట కైకకే తెలీదు. తెలిసేక ఆశ్చర్యపోయింది. అప్పుడో గోపీసుందరం అలా ఆశపెట్టేడు, వెళ్ళిపోయేడు. ఇప్పుడీ సుందరగోపాలంమీద ఆశలెలా పెంచుకోవడం ?

వూహుం - ఆశలు పెంచుకోదలచలేదు కైక. అతన్తో మాటాడనైనా లేదు. అతన్ని గురించి తన స్నేహితురాండ్రతో ప్రసక్తిగానైనా ప్రస్తావించలేదు.

కాని, వొకసారి పండగ శెలవుల్లో వూరికెళ్ళిన కైకకి హఠాత్తుగా వొక విచిత్రమైన వుత్తరం వొచ్చి ఆమెను వొక్కసారిగా ఆనందపరచి అంతులేని ఆశల్లో ముంచేసింది. కైక కొచ్చిన ఆ వుత్తరాన్ని వొక్క కైకే గాక కైక తండ్రీ చదివేడు, కైక చెల్లెళ్ళూ చదివేరు. ఆ వుత్తరంలో ఇలావుంది—

కుమారి కైక గారికి—

మీ క్లాస్‌మేట్ యస్. గోపాలం మిమ్మల్ని ప్రేమిస్తున్నాడు.

అతి గాఢంగా ప్రేమిస్తున్నాడు.

కాని, అతనిదొక వింత ప్రవృత్తి. తను మిమ్మల్ని ప్రేమించే విషయం మీకు చెప్పడానికి జంకుతున్నాడు.

అతనంటే మీకు ఇష్టమైతే-బహుశా మీరిద్దరూ పెళ్ళాడ వచ్చు.

ఇట్లు<br>
ప.పా.<br>
(పరోపకారి పాపన్న)

కైక ఇంట్లో ఆ వుత్తరమ్మీద చాలా చర్చ జరిగింది. పపా ఎవరో అంతుపట్టలేదు. యస్. గోపాలమే వుత్తరం అలా రాయించేడా ? అతనంత పిరికివాడా ? లేక, ఇదంతా ఇంకెవరైనా నవ్వు లాటకి చేస్తున్నారా ? ఏదీ అంతుబట్టలేదు.

కైకతండ్రి మనసులో ఏదో ఆశ తళుక్కుమంది. “అతన్నోసారి మన ఇంటికి రమ్మని రాయమ్మా !... ...” అన్నాడు. తండ్రి

ఆలోచన కైకకి అర్థమయింది. కైక అంత అమాయకురాలేం కాదు. వెంటనే ఉత్తరం రాసింది

శ్రీ యస్. గోపాలంగారికి–

మానాన్నగారు మిమ్మల్ని చూడాలనుకుంటున్నారు. వెంటనే వొకసారి మావూరొచ్చి వెళ్ళండి.

–కైక.

ఉత్తరం పోస్టుచేసిన మరుసటి క్షణం నుంచే (!) యస్. గోపాలంకోసం ఎదురుచూడ్డం ప్రారంభించింది కైక. మరుసటి దినంకూడా రాలేదు గోపాలం (!). ఆ తర్వాత మూడు దినాలు వరసగా ఎదురుచూసినా గోపాలం వొచ్చే జాడలేదు. నాలుగోరోజున ఉత్తరం వొచ్చింది. యస్. గోపాలం ఉత్తరం.

"కుమారి కైకగారికి–

నమస్తే!

మీ ఉత్తరం చూసి నేనెంతో ఆశ్చర్యపోయి, నమ్మలేక పోయి—అది అసలు నాకు రావాల్సిన ఉత్తరమేనా అని కవరు మీది అడ్రెసు వొకటికి రెండుసార్లు సరిచూసుకున్నాను. మీరు నాకు ఉత్తరం రాయడం ఏమిటని ఇంకా సందేహంలోనే వున్నాను. రమ్మని రాసేరు. ఎందుకో ఏమిటో రాయలేదు. అంతా గందరగోళంగా వుంది నాకు. గొప్ప సస్పెన్స్‌గా వుంది. వివరాలు రాస్తే–అవసరమైతే రావడానికి నాకేమీ అభ్యంతరం లేదు.

చిత్తగించండి,
యస్. గోపాలం.

బాగా వేడెక్కిన చిమ్నీమీద నీటిబొట్టు పడినట్టయింది కైకకి. కైక తండ్రికెక్కడా ఏమీ తోచలేదు. "ఆ ఉత్తరం అతను రాయించలేదేమో!......సరే–ఎందుకేనా మంచిది—అసలు విషయం ఇదీ అని అతనికో ఉత్తరం రాయి.. మనిషన్నా ఎదురుపడితే నిజా నిజాలు కొంతవరకైనా తెలుస్తాయి–" అన్నాడు కైక తండ్రి.

ఆపో ఉత్తరం మడిచి కవర్లో పెట్టి, దాంతోబాటు ఇంకో ఉత్తరం రాసి యస్. గోపాలానికి పోస్టు చేసింది కైక. తిరుగు టపాలో వచ్చేడు గోపాలం. కైకా, కైకతండ్రీ, కైక చెల్లెళ్ళూ అందరూ ఆనందించేరు.

కైక తండ్రి యస్. గోపాలానికి చెయ్యాల్సిన మర్యాదలన్నీ చేస్తూనే అతని అంతర్యం ఏమిటో కనిపెట్టడానికి ప్రయత్నించేడు. కాని–ఏదీ నికరంగా తెలీలేదు.

"ఆ ఉత్తరం మీరు నన్ను రమ్మనడం–అంతా గమ్మత్తుగా వుంది–" అన్నాడు గోపాలం. "అలా జరిగినందుకు నాకూ బాధగానే వుంది–" అన్నాడెందుకో,

"బాధెందుకూ?" అని సందేహంలో పడ్డాడు కైక తండ్రి. "ఆఁ–దానిగేముంది లెండి–అప్పుడు లేకపోయినా–ఇప్పుడు మీ మనసులో ఏదైనావుంటే...ఆలోచిద్దాం......కాని, మా స్థితి మా తం ఇంతే–"అంటూ తను ఇంకా ఆడపిల్లలకి పెళ్ళిళ్ళు చెయ్యాల్సివున్న పరిస్థితీ, ఎవ్వరికీ కట్నంగా ఏమీ ఇవ్వలేని తమ అశక్తతా అన్నీ వివరించేడు. "అయితే–మర్యాదకి మాత్రం ఏమీ లోటు రానివ్వన్నేను–" అన్నాడు చివరగా.

ఆ మాటకి నవ్వేడో, ఇంకెందుకు నవ్వేడోగాని–నవ్వేడు యస్. గోపాలం.

కర్టెన్ వెనుకనుంచి ఆ నవ్వు చూసిన కైకకి చెప్పరాని ఆనందంతో తనువు పులకరించింది.

"చూద్దాంలెండి–మా వాళ్ళతోనూ ఆలోచించాలి–" అన్నాడు యస్. గోపాలం.

"తప్పకుండాను, పెద్దవాళ్ళతో చెప్పకుండామాత్రం ఏ పనీ చెయ్యకూడదు మీరు–" అన్నాడు కైక తండ్రి అర్థవంతంగా.

మంచి బాలుడు రాముడిలాగా అందరి దగ్గరా శెలవు తీసుకుని నిష్క్రమించిన యస్. గోపాలాన్ని చూసి ఎంతో ముచ్చటయింది కైకకి.

ఇతను నన్ను చేసుకుంటాడా?–చేసుకుంటే!...

చేసుకోకపోతే?......

టౌనుకు మళ్ళీ వొచ్చేక యస్. గోపాలం కలవరమే వదలకుండా పట్టుకుంది కైకని. గోపాలం క్లాస్‌కు మామూలుగా వొచ్చేవాడు. క్లాస్‌నుంచి మామూలుగా వెళ్ళేవాడు.

ఈ దొంగాటకం భరించలేకపోయింది కైక.

తెగించి తనే అడుగుముందుకు వేసింది. టెలిఫోన్ కాల్స్, [illegible]కల్ ఉత్తరాలు, లైబ్రరీలో గుసగుసలు, క్యాంటీన్‌లో మంతనాలు, [illegible] సినిమాలు......

"ఇహ చెప్పకండి చాలు–" అన్నాను.

"ఏం?–"

"అర్థమైంది"

"ఏఁవిటర్థమైంది గోంగూర–"

"జరిగిందేమిటో అర్థమైంది- మీ ముఖ కవళికల వల్లే—" అన్నాను.

"ఏం లేదు—" అంది కైక దబాయింపుగా, బుకాయింపుగా.

"...ఎంతగా పాత్రలకి దాసోఽహమంటున్నా నేనూ ఒక కథ కున్నే......ఒకదినం సాయంత్రం కైక తన వూరికి ప్రయాణమైంది. బస్ స్టేండ్‌లో హఠాత్తుగా యస్. గోపాలం కనిపించేడు: ఇప్పుడేం వూరికెళ్తావ్-సినిమా చూసి పొద్దూలే రమ్మని పిలిచేడు, సరేనంది కైక. ఇద్దరూ సినిమా చూసేరు. వూరికెళ్తున్నానని రిజిస్టర్‌లో రాసి హాస్టల్‌నుంచి వచ్చేనుగా - ఇప్పుడెలా—అంది కైక. లాడ్జీలో రూం తీసుకుంటే పోలా?—అన్నాడు యస్. గోపాలం. ఒప్పుకోలేదు కైక. కాని, ఒప్పుకోక తప్పేదేముంది? రూం తీసుకున్నాక - ఈ రాత్రిలో ఇహ నేను మాత్రం మా హాస్టల్‌కేం వెళ్తాను—అన్నాడు గోపాలం—"

"చాలు- ఆపండిహ—గోపాలం ఆ మాట అనలేదు—"

"వెరీ గుడ్—అయితే అంతవరకూ జరిగిందంతా మాత్రం నిజమేనన్నమాట...సరే—గోపాలం ఇంకేమాట అన్నట్టూ? కైక అతడికేమీ అడ్డుచెప్పలేదూ?—"

వున్నట్టుండి కైక ముఖం వివ్రరబారిపోయింది. చేతుల్లో ముఖం దాచుకుంది. లజ్జవల్లా, అవమానంవల్లా ఆమె గొంతు శూన్యంగా ధ్వనించింది—"ఇహ చాలు—ఇహచాలు—నా కథ—అయిపోయింది—"

గ్లాసుతో మంచినీళ్ళు అందించేను. "అయామ్‌సారీ! రియల్లీ వెరీ వెరీ సారీ!—టేకిటీజీ—" అన్నాను.

మంచినీళ్ళు తాగింది కైక. చాలాసేపటికి పూరతేర్లింది.

ఆమెను గురించే ఆలోచిస్తూ కొత్త సిగిరెట్టు వెలిగించేను.

ఆమెపట్ల సానుభూతీ, జాలీ నాలో క్షణక్షణానికీ అధికమౌతున్నాయి.

అన్నిటికన్నా ఆమె నిష్కపటం నాకు బాగా నచ్చింది.

"చెప్పండి సార్! రచయిత ఆనందరావుగారూ!...... నా కథ మీరు నవలగా రాయగలరా?..."

"ముగింపు లేదు—"

"మీరు కల్పించలేరూ?—కావలిస్తే—నన్ను చంపెయ్యండి—"

వింత కోరికగా అడుగుతోంది నా పాత్ర—తనని చంపెయ్యమని!

"ఎలా చంపడం?..."

"హత్య, ఆత్మహత్య, యాక్సిడెంట్—"

"అవునింతకీ యస్. గోపాలం ఇప్పుడెక్కడున్నాడు? అతడు కైకను పెళ్ళెందుకు చేసుకోడు?—"

నా ప్రశ్నతో గంభీరంగా మారిపోయింది కైక.

శూన్యంగా చూసింది.

శూన్యంగా నవ్వింది.

"యస్. గోపాలం కైక జీవితమ్మీద పెద్ద దెబ్బ కొట్టేడు: లాడ్జిలో ఆ సంఘటన తర్వాత సిగ్గువిడిచి తనని చేసుకొమ్మని అడగసాగింది కైక. ఆ సాకులూ ఈ సాకులూ చెప్పేడు. యాభై వేల కట్నం లేనిదే మా నాన్న ఒప్పుకోడన్నాడు. ఆ తర్వాత—నేనెంతకీ నా ప్రయత్నాలు మానకపోయేసరికి—చివరికేమన్నాడో తెలుసా ?"

"ఏమన్నాడు ?—"

"గోపీసుందరంతో నువ్వు నడిపిన గ్రంథం తెలిసి కూడా—నన్నెలా చేసుకొమ్మంటావ్?—అన్నాడు—"

"గాడ్! అతనికెలా తెలిసింది? ఎప్పుడు తెలిసింది?—"

"ఎప్పుడో తెలిసిందతనికి. ఎలాగైతేనేం? తెలిసింది! తెలుసుకుని పథకం వేసేడతను—అందితే ఆఘ్రాణించి చూద్దామనుకున్నాడు—ఆ పరోపకారి పాపన్న వుత్తరం—అతనే రాయించేడు—" కైక గొంతు దుఃఖంవల్లా, బాధవల్లా రుద్ధమైపోయింది.

(ఇంకావుంది)